
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
గురువారం 4 డిసెంబరు 2025




ఏకగ్రీవాల పర్వం

జనగామ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మొదటి విడత ఎన్నికల్లో ఏకగ్రీవాల పర్వం కొనసాగింది. జనగామ జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో భాగంగా లింగాలఘణపురం, స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్, చిల్పూర్, రఘునాథ పల్లి మండలాల్లో 110 గ్రామ పంచాయతీలు, 1,024 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఐదు మండలాల పరిధిలో సర్పంచుల స్థానాలకు 811, వార్డు సభ్యులకు 2,399 నామినేషన్లు వచ్చాయి. నామినేషన్ల పరిశీలనలో అక్కడక్కడా పలు వార్డు స్థానాల నామినేషన్లు (మిగతా 8వ పేజీలో)

చికాకుల షి'కారు'

గ్రామ పంచాయతీ ఎన్నికలు గులాబీ నేతల్లో చిచ్చుపెడుతున్నాయి. ముందుముందు నియోజకవర్గాల పునర్విభజన ఉండటంతో సేఫ్ సీటుపై గులాబీ నేతలు కన్నేస్తున్నారు. దీంతో పంచాయతీ ఎన్నికల్లో కొత్త పంచాయితీ మొదలైంది. ప్రధానంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తితో పాటు వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతలు కావాలని పట్టుబడుతుండటం, ఆయన వ్యతిరేక శిబిరం అడ్డుపడుతుండటంతో గులాబీలో అంతర్గత కుమ్ములాటలకు తెర తీస్తోంది. దాదాపు రెండేళ్లుగా వరంగల్, జనగామ జిల్లాకు అధ్యక్షులను అధిష్ఠానం నియమించకపోవటం గులాబీ కేడర్‌లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది. పంచాయతీ ఎన్నికల్లో కేడర్‌ను సమన్వయం చేసే దిక్కు లేకుండా పోయారన్న చర్చ జరుగుతోంది.



'గులాబీ'లో గలాటు

బీఆర్‌ఎస్ నేతల మధ్య పంచాయితీ

- వర్ధన్నపేట నియోజకవర్గ బాధ్యతలపై ఎర్రబెల్లి వర్సెస్ వినయభాస్కర్
- పాలకుర్తితో పాటు వర్ధన్నపేట తనదే అంటున్న ఎర్రబెల్లి
- హనుమకొండ జిల్లా పరిధిలోని మండలాల్లో వినయ్ పంచాయితీ
- మనస్తాపంతోనే కేటీఆర్ పర్యటనకు ఎర్రబెల్లి దూరంగా ఉన్నట్లు ప్రచారం
- రెండేళ్లుగా జనగామ, వరంగల్ జిల్లాకు అధ్యక్షులను నియమించని అధిష్ఠానం
- బీఆర్‌ఎస్ నేతల్లో సమన్వయలోపంతో పంచాయతీ ఎన్నికలపై ప్రభావం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన ఓరుగల్లులో గులాబీ పుట్టెడు కష్టాల్లో ఉంది. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలతోపాటు ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో ఘోరపరాజయంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. అధికారం లేకపోవటం, పార్టీ కీలకనేతల వలసలతో గులాబీ తుమ్మెళ్లలో నైరాశ్యం నెలకొంది. అయితే పంచాయతీ ఎన్నికల్లో పట్టు సాధించి పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు అధిష్ఠానం చేస్తున్న ప్రయత్నాలు నేతల ఆధిపత్య పోరుతో నీరుగారిపోతోందనే ఆందోళన గులాబీ శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది. ప్రధానంగా రాజకీయాల్లో ఉద్ధండుడిగా పేరున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ ప్రజాసమస్యలపై పాలకుర్తి నియోజకవర్గంలో తిరుగుతున్నారు. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు వర్ధన్నపేట మాజీ అరూరి రమేష్ రాజీనామా చేశారు. దీంతో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి ఇవ్వాలని ఒకవర్గం అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చింది. అయితే పాలకుర్తితో పాటు తనకే వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పట్టుబట్టారు. అయితే ఈ ఇన్‌చార్జి బాధ్యతల గొడవకు కేసీఆర్ ఫుల్‌స్టాప్ పెడుతూ గత ఏప్రిల్‌లో జరిగిన పార్టీ రజతోత్సవ వేడుకల బాధ్యతలు దయాకర్ రావుకే అప్పగించారు. అయితే పంచాయతీ ఎన్నికలు రావటంతో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలపై మరోసారి లొల్లి తెరపైకి వచ్చింది. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న (మిగతా 7లో..)



కేటీఆర్ ఫోన్‌లో మాట్లాడుతుండగా హసన్‌పర్తి ముఖ్య నాయకులకు వినిపిస్తున్న ఎర్రబెల్లి (ఫైల్)



- ముగిసిన మొదటి విడత నామినేషన్ల ఘట్టం
- అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు
- నమూనా బ్యాలెట్, పోస్టర్ల ప్రింటింగ్‌పై దృష్టి
- నేటి నుంచి మొదలుకానున్న ప్రచారం

ఇక ప్రచార హోరు!

జనగామ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార హోరు గురువారంతో ఆరంభం కానుంది. జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ ఘట్టం పూర్తి కావడంతో ఇకపై ప్రచారం హోరెత్తనుంది. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత బరిలో ఉన్న అభ్యర్థులు జనంలోకి వెళ్లనున్నారు. బరిలో ఉన్న మొదటి విడత అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు సైతం పూర్తి కావడంతో పూర్తిస్థాయిలో ప్రచారంపైనే అభ్యర్థులు దృష్టి సారించనున్నారు. గురువారం నుంచి ఈనెల 11 వరకు ప్రచార, ప్రలోభాల్లో అభ్యర్థులు నిమగ్నం కానున్నారు. జిల్లాలో మొదటి విడత ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు పూర్తయింది. నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు అక్షర క్రమం ప్రకారం సీరియల్ నంబర్, సీరియల్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం రూపొందించిన గుర్తులను రిటర్నింగ్ అధికారులు కేటాయించారు.

నమూనా బ్యాలెట్లు, పోస్టర్ల ప్రింటింగ్

గుర్తుల కేటాయింపు పూర్తి కావడంతో బరిలో ఉన్న అభ్యర్థులు ప్రచారంపై దృష్టి సారించారు. ప్రచారానికి అవసరమయ్యే సామగ్రి, కండువాలు, నమూనా బ్యాలెట్లు, కరపత్రాలు, డోర్, వాల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు, వెహికిల్ స్టిక్కర్ల వంటి వాటిని సమకూర్చుకునే పనిలో పడ్డారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో అధికారులు బరిలో ఉన్న వారికి (మిగతా 8లో..)

మొదటి విడతలో మండలాల వారీగా బరిలో ఉన్న అభ్యర్థులు

మండలం పేరు	మొత్తం సర్పంచ్ స్థానాలు	బరిలో ఉన్న అభ్యర్థులు	మొత్తం వార్డు స్థానాలు	బరిలో ఉన్న అభ్యర్థులు
లింగాలఘనపురం	21	69	196	436
జఫర్‌గఢ్	21	72	194	312
చిల్పూర్	17	51	168	329
స్టేషన్‌ఘన్‌పూర్	15	47	146	287
రఘునాథపల్లి	36	160	320	619
మొత్తం	110	399	1024	1983

నేటి నుంచి మొదలుకానున్న ప్రచారం

నామినేషన్ల ఉపసంహరణ పూర్తి కావడంతో జిల్లాలో గురువారం నుంచి మొదటి విడత ఎన్నికల ప్రచారం ప్రారంభం కానుంది. దీనికోసం అన్ని రాజకీయ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. ఆయా రాజకీయ పార్టీలు తమ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించేందుకు సన్నద్ధం అవుతున్నారు. పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులకు ప్రచారంలో పూర్తి సహకారం అందించాలని కేడర్‌కు ఆయా పార్టీల నేతలు ఆదేశాలు జారీ చేశారు. ఇదే క్రమంలో స్వతంత్ర అభ్యర్థులకు మద్దతుగా బంధువులు, స్నేహితులు, సన్నిహితులు ప్రచారంలో పాల్గొనున్నారు.

ప్రారంభమైన మూడో విడత నామినేషన్లు

- మొదటి రోజు 78 నామినేషన్లు దాఖలు

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య

8

పోస్టల్ బ్యాలెట్‌ల పంపిణీ
సక్రమంగా జరగాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ పత్రాల పంపిణీ సక్రమంగా జరగాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ నుంచి బుధవారం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్‌తో కలిసి ఎంపీడీవోలు, తహసీల్దార్లతో గూగుల్ మీట్ ద్వారా రివ్యూ నిర్వహించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈనెల 9న ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కోసం ఫెసిలిటేషన్ కేంద్రంకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎవరికైతే పోస్టల్ బ్యాలెట్ ఇస్తున్నామో వారి వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. రెవెన్యూ శాఖ అధికారి గెజిటెడ్ అధికారిగా ఫారం-17లో సంతకం చేయడానికి అందుబాటులో ఉంటారని చెప్పారు. పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీడీవోలు చూసుకోవాలని ఆదేశించారు. మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో ఈనెల 6న పోలింగ్ అధికారులకు రెండో విడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 4న మొదటి విడత పోలింగ్ జరిగే మండలాల్లో అభ్యర్థులకు ఎన్నికల వ్యయానికి సంబంధించిన అవగాహన కల్పించాలని అన్నారు.

అభ్యర్థుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

- ఎన్నికల పరిశీలకుడు రవికిరణ్

పాలకుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచు, వార్డు స్థానాల అభ్యర్థుల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని ఎన్నికల పరిశీలకుడు రవికిరణ్ అన్నారు. బుధవారం మండలంలోని పాలకుర్తి క్లస్టర్ల నామినేషన్ కేంద్రాలను స్టేషన్ ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్నతో కలిసి రవికిరణ్ సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కేంద్రాల్లో నామినేషన్ వేసిన అభ్యర్థుల దరఖాస్తులను ఫారం-4, ఫారం-5లను ఎప్పటికప్పుడు అందచేయాలని సూచించారు. ఎన్నికల నియమావళి ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని, కోడ్ పక్కాగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో వేదవతి ఉన్నారు.



పాలకుర్తి క్లస్టర్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా పరిశీలకుడు రవికిరణ్

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి : డీసీపీ

గ్రామ పంచాయతీ ఎన్నికలను అధికారులు ప్రశాంతంగా నిర్వహించాలని జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని పాలకుర్తి, చెన్నూరు, వల్మిడి క్లస్టర్ల నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగే నామినేషన్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు సహకరించాలని సూచించారు. ఎలాంటి గొడవలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఏసీపీ నర్సయ్య, సీఐ జానకిరాంరెడ్డి, ఎస్సై పవన్‌కుమార్ ఉన్నారు.

శాతాపురంలో పట్టపగలు చోరీ

- బంగారం, వెండి ఆభరణాలు అపహరణ

పాలకుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మండలంలోని శాతాపురం గ్రామంలో బుధవారం జరిగింది. ఎస్సై దూలం పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామంలో దర్గాని సురేష్ కుటుంబ సభ్యులతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి పనులు చేస్తున్నారు. ఇదేఅదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలు ఎవరూ లేని సమయంలో ఇంటి తాళం, బీరువా తాళాలు పగులగొట్టారు. స్థానికులు ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో వ్యవసాయ బావి వద్ద ఉన్న సురేష్‌కు సమాచారం అందించారు. ఇంటికి వచ్చిన బాధితుడు సురేష్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న 3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు రూ.50వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ఇంట్లోని బీరువా తాళాలు పగులగొట్టిన దొంగలు

సర్పంచ్ బరిలో అంగన్‌వాడీ టీచర్

- ఉద్యోగానికి రాజీనామా చేసిన కౌసల్య



బచ్చన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బచ్చన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బరిలో నిలిచేందుకు అంగన్‌వాడీ టీచర్ కర్రె కౌసల్య తన పదవికి రాజీనామా చేసింది. ఉన్నత విద్యావంతురాలైన ఆమె సమాజంలో ఎంతో కొంత మార్పు తీసుకురావాలని, గ్రామాన్ని సమగ్రాభివృద్ధి చేయాలనే సదుద్దేశ్యంతో ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్టు తెలిపింది. ఎస్సీ జనరల్ స్థానంగా రిజర్వ్ అయిన బచ్చన్నపేట పంచాయతీకి జరుగుతున్న ఎన్నికల్లో కౌసల్య పోటీకి దిగింది. ఉస్మానియా యూనివర్శిటీలో ఎంఏ సోషియాలజీ చేసిన కౌసల్య 2002 నుంచి మండల కేంద్రంలో అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్‌గా పనిచేస్తోంది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సుచరిత

దివ్యాంగుల వికాసానికి
తోడ్పాటునందించాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి సుచరిత

జనగామ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల వికాసానికి సమాజం తోడ్పాటునందించాలని జనగామ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సుచరిత అన్నారు. బుధవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. జనగామ జిల్లా కేంద్రంలోని భవిత సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో (మిగతా 8వ పేజీలో)

పార్టీ విధేయులకు తగిన గుర్తింపు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్టీ విధేయులకు తగిన గుర్తింపు ఉంటుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని మీదికొండ గ్రామానికి చెందిన పార్టీ నాయకులు బుధవారం ఎమ్మెల్యే కడియంను హనుమకొండలోని నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ పార్టీలో ఉండి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల వారీగా పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలని అన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం పాటుపడాలన్నారు. గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే అనేక అభివృద్ధి పనులు వస్తాయని తెలిపారు. ఇంటింటి ప్రచారంను పకడ్బందీగా నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూదుల రత్నాకర్‌రెడ్డి, నాగరబోయిన యాదగిరి, జోగు కుమార్, జోగు వసంత, కాసాని శ్రీకాంత్, పారిజాతం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కడియంను కలిసిన మీదికొండ నాయకులు

సర్వేలన్నీ బీఆర్‌ఎస్ పార్టీ వైపే..

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుస్తుందని సర్వేలన్నీ చెబుతున్నాయని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. పాలకుర్తిలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో తొర్రూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేతలు, శాతాపురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు బుధవారం దయాకర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరగా గులాబి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న జరిగే పంచాయతీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి అభ్యర్థులను గెలిపించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. 420 హామీలిచ్చి అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ముఖ్యంగా మహిళలను, రైతులను, విద్యావంతులను, నిరుద్యోగులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో పసులాది ఎల్లయ్య, అంజయ్య, యాకస్వామి, విజయ్, యువప్రసాద్, కిరణ్‌కుమార్, పద్మ, చొక్కయ్య, వినయ్, బీజేపీ నుంచి అనగంటి వెంకటేష్, కంజర్ల యాకన్న, వెంకటమ్మలు చేరారు. కార్యక్రమంలో పసునూరి నవీన్, మాచెర్ల ఎల్లయ్య, నల్ల నాగిరెడ్డి, పెండ్లి ఎల్లయ్య, రాంరెడ్డి, లొంక మల్లేష్, ధనుంజయ, మాజీ సర్పంచు మల్లారెడ్డి పాల్గొన్నారు.



పాలకుర్తిలో బీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలకు కండువా కప్పుతున్న ఎర్రబెల్లి

తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వినోద్‌కుమార్



పెద్దవంగర, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దవంగర మండల తహసీల్దార్‌గా బలభద్ర వినోద్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ వీరగంటి మహేందర్ ఏసీబీ అధికారులకు పట్టుపడగా ఆయన స్థానంలో జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో పని చేస్తున్న వినోద్‌కుమార్ పెద్దవంగర మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. నూతన తహసీల్దార్‌కు సిబ్బంది ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్ కుమార్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటు ఉండి వారి సమస్యల ను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ లష్కర్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో బుధారపు శ్రీనివాస్

పెద్దవంగర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవో బుధారపు శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో (ఎంఆర్సీ) దివ్యాంగులకు పలు అంశాలపై అవగాహన కల్పించి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులు అందరితోపాటు సమానమేనని అన్నారు. ప్రస్తుత కాలంలో దివ్యాంగులమని నిరుత్సాహ పడొద్దని అన్నారు. దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో అన్ని రంగాల్లో రాణించాలని, వారి సామర్థ్యాన్ని గుర్తించి ఉన్నతస్థాయిలో రాణించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనూష, సత్యనారాయణ రెడ్డి, భీమా, మధుసూదన్‌రెడ్డి, చిరంజీవి, నిఖిల్, సీఆర్పీలు సంతోష్, నిరంజన్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తొర్రూరు , డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవుళ్లపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అను చిత వ్యాఖ్యలకు ఖండి స్తూ బుధవారం తొర్రూ రు పట్టణ కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షు డు పైండ్ల రాజేశ్ ఆధ్వ ర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువులకు సంబంధించిన దేవి దేవతలను అవహేళన చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అహంకారపూరితంగా మాట్లాడిన మాటలను చాలా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఒక హిందువుగా ఉంటూ, హిందువుల మీద, దేవి దేవతల మీద రేవంత్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం శోచనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అలిసేరి రవిబాబు, యాకన్న, రవి, భరత్, శ్రీనాథ్, నూకల నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నర్మెట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బాలికల విద్యను ప్రోత్సహించడం ప్రతీ కుటుంబం బాధ్యత అని జిల్లా మహిళా సాధికారిక అధికారులు పవిత్ర, రాణి అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గర్ల్‌చైల్డ్ అండ్ ఎడాలసెంట్, ఎంపవర్మెంట్ క్లబ్, ఎన్ఎస్ఎస్ జిల్లా యూనిట్ మహిళా సాధికారిక విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'మహిళా భద్రత - బాలిక సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల విద్య, సురక్షిత వాతావరణం, ఆరోగ్యం, బాల్యవివాహాల నివారణ, లింగ సమానత్వం అంశాలపై సూచనలు చేశారు. అనంతరం జిల్లా మహిళా సాధికారిక అధికారులు పవిత్ర, రాణి మాట్లాడుతూ... మహిళల పట్ల వివక్షను నిర్మూలించేందుకు సమాజం కలిసి పనిచేయాలన్నారు. మహిళలపై హింస నివారణకు చట్టాలు, డ్రగ్స్ అడిక్షన్, సైబర్ క్రైమ్స్, చైల్డ్ మ్యారేజెస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పుష్పకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జానీనాయక్, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో నర్సింగరావు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు చూడాలని ఎంపీడీవో నర్సింగరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ పత్రాలను అందించే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 146 పోలింగ్ కేంద్రాలు ఉండగా అందులో 8 కేంద్రాలు ఏకగ్రీవం కాగా, మిగితా 138 కేంద్రాల్లో పోలింగ్ జరుగనుందన్నారు. ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లను సిద్ధంచేసే ప్రక్రియ విజయంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సీఐ జి.వేణు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీసులు, విద్యార్థులు

సైబర్ నేరగాళ్ల మాటలను నమ్మవద్దు

జనగామ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల మాటలను నమ్మి మోసపోవద్దని జనగామ సీఐ సత్యనారాయణ రెడ్డి అన్నారు. ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సీఐ అవగాహన సదస్సు నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఎవరు కూడా వ్యక్తిగత సమాచారాన్ని, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. అపరిచితుల నుంచి ఫైల్ అటాచ్ లింకులు వస్తే ఓపెన్ చేయవద్దని, డిజిటల్ అరెస్టు పేరుతో వచ్చే బెదిరింపులకు భయపడవద్దని అన్నారు. సైబర్ మోసానికి గురయ్యామనే అనుమానం వస్తే సైబర్ క్రైమ్, పోలీసులను సంప్రదించాలని పేర్కొన్నారు.

సైబర్ నేరాల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక సాంకేతిక సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అందరూ జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైమ్ ఏసీపీ కె.గిరికుమార్ సూచించారు. హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా గిరికుమార్ మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో జరుగుతున్న సైబర్‌నేరాల్లో చువుకున్న ఉద్యోగులు మోసపోతున్నారన్నా రు. విద్యార్థులు సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. సోషల్ మీడియాను అతిగా వాడితే హాని తప్పదని హెచ్చరించారు. అపరిచతులకు వ్యక్తిగత సమచారాన్ని సమర్పించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ ఎ.గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్.శ్రీనివాసరావు, సీఐలు అశోక్, శివకుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్.రాజ్‌కుమార్, అధ్యాపకులు యాకూబ్, దయాకర్, భిక్షపతి, విజయ్‌చందర్, రాజేష్, శ్రీదేవి, రేవతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన అర్చక, ఉద్యోగ సంఘనేతలు

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచారి, జేఏసీ కోకన్వీనర్ డీవీఆర్ పరాశరం రవీంద్రాచార్యులు బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిశారు. అర్చక, ఉద్యోగులు ఎదర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తమ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అభ్యర్థించారు. ఇందుకు టీపీసీసీ అధ్యక్షుడు సానుకూలంగా స్పందించారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి



నరేశ్ (ఫైల్)

తొర్రూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన ఒకరు మృతి చెందిన సంఘటన తొర్రూరు మండలం మాటేడు గ్రామ శివారు బండమీది తండాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... గ్రామ పరిధిలో బండమీది తండాకు చెందిన జాటోత్ నరేశ్ (38) తండా సమీపంలోని ఓ చెరువు వద్ద తూములో ఉన్న చేపలు పట్టడానికి తండ్రి బాలు, కుమారుడు హరికృష్ణతో కలసి వెళ్లారు. ఈ క్రమంలో తూములో తక్కువ నీరు ఉండడంతో లోపలికి వెళ్లి చేపలు తేవడానికి వెళ్లిన నరేశ్ శ్వాస ఆడకపోవడంతో అక్కడే మృతి చెందాడు. లోపలినుంచి తండ్రి బయటకు రాకపోవడంతో కుమారుడు హరికృష్ణ గ్రామస్థుల సహకారంతో నీటిని బయటకు వెళ్లదీసి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

ధాన్యం త్వరగా తరలించాలి



మాటేడు కొనుగోలు కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

తొర్రూరు రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు నిర్వహించి ధాన్యాన్ని త్వరితగతిన తరలించాలని తొర్రూరు తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఆదేశించారు. బుధవారం మండలంలోని మాటేడు, చెర్లపాలెం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యం ఎప్పటికప్పుడు కాంటాలు నిర్వహించి మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలు పడే అవకాశం ఉన్నందున్న రైతులు, నిర్వాహకులు టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులు ఎలాంటి అందోళన చెందవద్దని, ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ నర్సయ్య, జీపీవోలు, రెవెన్యూ సిబ్బంది, సెంటర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.నాగయ్య

మరిపెడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం బలపరిచిన సర్పంచ్, వార్డు అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.నాగయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం మండలంలోని గుండెపూడి గ్రామంలో జరిగిన సీపీఎం కార్యకర్తల సమావేశానికి ఆయన జిల్లా కార్యదర్శి సాధుల శ్రీనివాస్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ గుండెపూడి గ్రామ వెనుకబాటుకు గత పాలకుల నిర్లక్ష్యమేనని, ఇప్పుడు జరిగే పంచాయతీ ఎన్నికల్లో సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని ఆ ఊరి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల కోసం సీపీఎం నిరంతర పోరాటలను వివరించారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు అల్వాల వీరయ్య, గుండగాని మధుసూదన్, బాణాల రాజన్న, రాజశేఖర్, కందాల రమేశ్, అల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పలయ్య, బయ్య సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ 11వ వార్షికోత్సవంలో ఆయన హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనకు సాధరంగా ఆహ్వానించారు. పూజలు చేసిన ఎమ్మెల్యే భూపాలపల్లి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని వేడుకున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్, నాయకులు ఇస్లావత్ దేవన్ పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి వేడుకలు

ఏటూరునాగారం: ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయిబాబా దేవాలయంలో గురువారం దత్త జయంతి, పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఆలయ అర్చకులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి దత్తాత్రేయ స్వామికి, సాయినాధునికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తుల కోసం భజనలు నిర్వహించి, మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ భక్తులు, అయ్యప్ప స్వాములు, శివ స్వాములు, భవానీ మాల ధారులు అధిక సంఖ్యలో తరలివచ్చి దత్తాత్రేయ స్వామి, సాయి నాధుని ఆశీస్సులు పొంది కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అంతేకాకుండా, పౌర్ణమి సందర్భంగా సాయంత్రం 5 గంటలకు పురవీధుల గుండా సాయి నాధుని పల్లకి సేవా కార్యక్రమం ఉంటుందని భక్తులకు ప్రభాకర్ తెలియజేశారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ



విద్యాసాగర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రి సీతక్క

ఏటూరునాగారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్ఎంపీ విద్యాసాగర్ కుటుంబాన్ని శాఖ మంత్రి ధనసరి సీతక్క బుధవారం సాయంత్రం పరామర్శించారు. ఏటూరునాగారంలోని విద్యాసాగర్ నివాసానికి చేరుకున్న మంత్రి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భార్య స్వరూప, కుమారుడు కిరణ్ ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. గ్రామీణ వైద్యుడిగా విద్యాసాగర్ సమాజానికి చేసిన సేవలను కొనియాడారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా నాయకులు ఎర్రబెల్లి మనోజ్ కుమార్, ముక్కెర లాలయ్య, వావిలాల చిన్నఎల్లయ్య, గంపల శివకుమార్‌తో పాటు పలువురు మండల, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి

● హాస్టల్స్ అధికారుల సమీక్షలో కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చేసే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, పరిష్కారం కోసం కృషి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గురుకులాలు, కస్తూర్బా గాంధీ, వెల్ఫేర్ హాస్టల్స్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్సులను నిత్యం పరిశీలించాలని సూచించారు. హాస్టల్స్‌లో ఆహార నాణ్యత లోపించడం, వైద్య పరీక్షల కోసం సిబ్బంది అందుబాటులో లేకపోవడం, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ఫోన్ సౌకర్యం లేకపోవడం, క్రీడా పరికరాల సమస్య, చలికాలం కలిగే ఇబ్బందులపై వారు ఫిర్యాదు చేశారని అన్నారు. వాటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

● ఫిర్యాదులపై కలెక్టర్ ఆగ్రహం..

విద్యార్థుల నుంచి అందిన పలు కీలక ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా పరిశీంచి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యాన్ని సహించేదిలేదని, ప్రతీ ఫిర్యాదుకు స్పష్టమైన కార్యాచరణతో నివేదిక అందించాలని హెచ్చరించారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో గీజర్లు, ఉన్ని బ్లాంకెట్లు ఏర్పాటు చేయాలన్నారు. కిరాణ సరుకుల శుభ్రత, నాణ్యత, రోజువారీ ఆహార సరఫరా, స్టోర్ మానిటరింగ్‌పై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. సోషల్, ట్రైబల్, బీసీ, ఎస్సీ, మైనారిటీ వెల్ఫేర్ శాఖలతో పాటు తెలంగాణ మోడల్ స్కూల్స్, కేజీబీవీ హాస్టల్స్ అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించవచ్చని అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ అధికారి పుష్పలత, ఎస్సీ సంక్షేమ అధికారి భాగ్యలక్ష్మీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సౌజన్య, మైనారిటీ వెల్ఫేర్ అధికారి రమేష్, జీసీడీవో ఫ్లోరెన్స్, ఆర్సీవోలు, ఏడీపీఆర్వో ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

● అబ్జర్వర్ ఫణీంద్రారెడ్డి



నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఫణీంద్రారెడ్డి

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియామవళిని పకడ్బందీగా పాటించాలని ఎన్నికల సాధారణ పరిశీలకుడు (అబ్జర్వర్) ఫణీంద్రారెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని నామినేషన్ పరిశీలన కేంద్రాలతోపాటు మహదేవపూర్ మండలంలోని ఎల్కేశ్వరం, అంబట్‌పల్లి నామినేషన్ కేంద్రాలను ఆయన బుధవారం సందిర్శంచారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రచార కార్యక్రమాలు, వాహనాలను నిశితంగా పరిశీలించాలన్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు సమకూర్చాలన్నారు. ఎఫ్ఎస్‌టీ బృందాలు తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. స్వాధీనం చేసుకున్న వస్తువులు, చేపట్టిన చర్యల వివరాలను తెలుసుకున్నారు. ఆయన వెంట పలిమెల, మహదేవపూర్ ఎంపీడీవోలు పవన్, రవీందర్ ఉన్నారు.

లారీ ఢీకొని ఒకరికి గాయాలు



గాయపడిన సుదర్శన్

మంగపేట డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి) లారీ ఢీకొని ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన ములుగు జిల్లా మంగపేట మండలంలోని రాజుపేటలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పెరికల కుంట గ్రామానికి చెందిన దాగం సుదర్శన్ (28) బ్రాహ్మణపల్లి గ్రామానికి వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వస్తున్న క్రమంలో రాజుపేట నుంచి మణుగూరు వైపు వెళ్తున్న ఇసుక లారీ ఢీకొంది. దీంతో సుదర్శన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్యం కోసం 108 అంబులెన్సులో వరంగల్‌కు తరలించారు. సుదర్శన్ పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.

జీఎంహెచ్ ఆర్ఎంవోగా మంజుల



వరంగల్ మెడికల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్ ఆర్ఎంవోగా డాక్టర్ అన్నెపాక మంజులను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ జిల్లా దామెర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ మంజుల డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పదోన్నతిపై జీఎంహెచ్ ఆర్ఎంవోగా బాధ్యతలు బుధవారం స్వీకరించారు. ఖమ్మంకు చెందిన డాక్టర్ మంజుల ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేశారు.


వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7100	6300
మక్కలు	1851	1521
కందులు	----	----
పెసళ్లు	----	----
పల్లికాయ (సూక)	5400	4860
పల్లికాయ (పచ్చిది)	----	----
పసుపు (కాడి)	11259	11000
పసుపు (గోల)	11556	11256
తేజ మిర్చి	----	----
తేజ మిర్చి ఏసీ	14200	9500
వండర్‌హాట్	----	----
వండర్‌హాట్ ఏసీ	18500	12000
యూఎస్341ఏసీ	16500	9000
దీపిక	----	----
సింగిల్‌పట్టి ఏసీ	----	----
తాలు మిర్చి	6000	4000

- వరంగల్ వ్యవసాయం

- పంచాయతీ వ్యవస్థలో సంస్కరణలు
- ఎన్టీఆర్ హయాంలో పలు మార్పులు
- నాడు బోర్డులు.. నేడు పంచాయతీలు..
- పంచాయతీలే నిచ్చెన మెట్లుగా ఎదిగిన నాయకులు
- తండాలకు పంచాయతీ హోదా
- 567 నుంచి 1,708కి పెరిగిన పంచాయతీలు



స్వపరిపాలనకు 130 ఏళ్లు

హనుమకొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక వనరులను, మానవ వనరులను సద్వినియోగం చేయడంలో ప్రతీ పౌరుడు భాగస్వాములు కావడానికి పంచాయతీరాజ్ సంస్థలు ఒక వేదికగా పని చేస్తాయి. వందల, కిలో మీటర్ల దూరంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రజలకు అందుబాటులో లేకపోవచ్చు. కానీ స్థానిక స్వపరిపాలన సంస్థలు పరిపాలనను ముంగిటకు తీసుకువెళ్లడంలో కీలక పాత్రను పోషిస్తాయి. పరిపాలనలో జవాబుదారీతనాన్ని, పారదర్శకతను నెలకొల్ప డానికి ఆలంబనగా పని చేస్తాయి. అలాంటి పంచాయతీ సంస్థల ప్రస్థానం, వాటి పరిణామ క్రమం ఎలా సాగిందో చూద్దాం..

నాడు బోర్డులు

దస్తుర్-అమల్ కింద జిల్లా స్థాయిలో జిల్లా బోర్డు, తాలూకా స్థాయిలో తాలూకా బోర్డులు తొలిసారిగా ఏర్పాటయ్యాయి. ఇవే ఆ తర్వాత కాలంలో అనేక మార్పులకు లోనయ్యాయి. దస్తుర్-ఉల్-అమల్‌కు ముందు సెస్సు వసూలు జిల్లాలో జనాభా అధికంగా ఉన్న (అంటే ప్రస్తుత మేజర్ పంచాయతీల్లాగా) కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉండేది. 1,899 నుంచి మొత్తం ఉమ్మడి జిల్లాకు వర్తింప చేశారు. జిల్లా బోర్డు హనుమకొండ కేంద్రంగా, తాలూకా బోర్డులు మహబూబాబాద్, ములుగు, పరకాల, పాకాల, జనగామ కేంద్రాలుగా పని చేసేవి.

పంచాయతీలు

ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ చట్టం 1964లో అమలులోకి రావడంతో అప్పటివరకు ఆచరణలో ఉన్న హైదరాబాద్ పంచాయతీ చట్టం-1856 రద్దయింది. పంచాయతీరాజ్ చట్టం కింద జిల్లాలో మొదట 1097 గ్రామాలను కలుపుకొని 564 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. వీటిలో 12 నోటిఫైడ్‌వికాగా 552 నాన్‌నోటిఫైడ్ పంచాయతీలు. 1965లో మరో నాలుగు పంచాయతీలు అదనంగా తోడయ్యాయి.

130 ఏళ్ల ప్రస్థానం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒకప్పుడు 567 పంచాయతీలు ఉండేవి. ఆ తర్వాత కాలంలో 1,008కి పెరిగాయి. తదనంతర కాలంలో అదనంగా మరో 700 తోడయి వాటి సంఖ్య ప్రస్తుతం 1708కి చేరుకున్నది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక స్వపరిపాలన 130 ఏళ్ల కిందటే ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక మార్పులకు లోనైంది. పంచాయతీలను బలోపేతం చేయడమే లక్ష్యంగా పలు చట్టాలు అమలులోకి వచ్చాయి. 1894లో దస్తుర్-ఉల్-అమల్ (క్రమబద్ధీకరణ)తో పంచాయతీలకు అంకురార్పణ జరిగింది. ఆ తర్వాత కాలంలో ఈ వ్యవస్థ మహావృక్షంగా ఎదిగింది. దీని నీడలో పల్లెలు ప్రగతి పథంలో పయనించాయి. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యానికి ప్రతిరూపాలుగా మారాయి.

ఐదంచెలు

ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీరాజ్ వ్యవస్థలో ఐదంచెల వ్యవస్థ అమలులోకి వచ్చింది. ఎన్టీఆర్ సమితులను రద్దు చేసి మండల వ్యవస్థను తీసుకువచ్చారు. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీకి మధ్య అదనంగా ఎంపీటీసీ, జడ్పీటీసీలను తీసుకువచ్చారు. దీంతో గ్రామాల్లో అప్పటి వరకు సర్పంచ్‌లకు ఉన్న అధికారాలు, ప్రాతినిధ్యం, వారి ప్రాబల్యం తగ్గిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీల పటిష్టతకు సంస్కరణలు చేపట్టింది. 500 జనాభా ఉన్న తండాలను కూడా పంచాయతీలుగా చేసింది. దీనితో ఉమ్మడి జిల్లాలో మరో 700 పంచాయతీలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం మొత్తం పంచాయతీల సంఖ్య 1008 నుంచి 1708కి పెరిగింది.

సర్పంచ్‌ల స్థాయి నుంచి..

పంచాయతీలు ఎందరో నాయకులకు రాజకీయ భిక్షపెట్టింది. రాజకీయాల్లో ఎదగడానికి నిచ్చెనలుగా నిలిచాయి. ఉమ్మడి జిల్లాలో సర్పంచ్ స్థాయి నుంచి రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగిన వారు ఎంతో మంది ఉన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు స్వర్గీయ హయగ్రీవాచారి మొదట వేలేరు సర్పంచ్. రాజకీయాల్లో రాణించి మంత్రి స్థాయికి చేరుకున్నారు. మాజీ మంత్రులు మండాడి నర్సింహారెడ్డి, నెమురుగొమ్ముల యతిరాజారావు, రెడ్యా నాయక్, చందూలాల్ తదతరులు వీరిలో ఉన్నారు. ఎడబోయిన బస్వారెడ్డి సర్పంచ్ నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యారు. బోడకుంటి వెంకటేశ్వర్లు కూడా సర్పంచ్ నుంచి ఎంపీ, ఎమ్మెల్సీ పదవులను అలంకరించారు. యతిరాజారావు భార్య విమలాదేవి కూడా సర్పంచ్ స్థాయి నుంచి జిల్లా పరిషత్ చైర్మన్ అయ్యారు. ప్రస్తుత రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఎంపీటీసీ స్థాయి నుంచి రాజకీయంగా ఎదిగారు.

సమితులు

1956లో హైదరాబాద్ జిల్లా బోర్డుల చట్టం ఏర్పాటు స్వపరిపాలనలో ఒక మైలురాయి. కానీ 1959లో ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్‌ల చట్టం వచ్చిన తర్వాత ఇది రద్దయింది. అప్పటి నుంచి పంచాయతీరాజ్ వ్యవస్థలో మూడంచెల వ్యవస్థ అమలులోకి వచ్చింది. 1959 డిసెంబరు 1న జిల్లా పరిషత్ ఏర్పాటైంది. అప్పట్లో జిల్లాలో 8 పంచాయతీ బ్లాకులు, 2 నాన్ సమితి బ్లాకులు ఉండేవి. 1952 అక్టోబరు 2న ములుగులో మొదటి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బ్లాక్ ఏర్పాటైంది. 1964లో సమితుల సంఖ్య 17కు పెరిగింది. అయితే ఇదే ఏడు జరిగిన పునర్‌వ్యవస్థీకరణ ఫలితంగా సమితుల సంఖ్య 14కు తగ్గింది. ఘనపూర్, వర్ధన్నపేట, హనుమకొండ, జనగామ, కొడకండ్ల, చేర్యాల, పరకాల, చిట్యాల, మహబూబాబాద్, మరిపెడ, నర్సంపేట, గూడూరు, ములుగు, ఏటూరునాగారం వీటిలో ఉన్నాయి. ప్రతీ సమితిలో దాని పరిధిలోని పంచాయతీల అధ్యక్షులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉండేవారు. పంచాయతేతర ప్రాంతం నుంచి ఒకరిని కలెక్టర్ నామినేట్ చేసేవారు. వీరితో పాటు ఒక మహిళ, ఒక ఎస్సీ, ఒక ఎస్టీకి కూడా సమితిలో ప్రాతినిధ్యం ఉండేది.

అశోక్ మెహతా కమిటీ

1977లో ఏర్పాటైన అశోక్‌మెహతా కమిటీ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి విలువైన సూచనలు, సిఫార్సులు చేసింది. గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరపాలని సూచించింది ఈ కమిటీనే.. జిల్లా స్థాయిలో ప్రణాళిక వికేంద్రీకరణ జరగాలని సిఫార్సు చేసింది. జిల్లా ప్రణాళికా వికేంద్రీకరణలో జిల్లా కలెక్టర్ ప్రధాన పాత్ర పోషించాలని, ప్రణాళిక వికేంద్రీకరణలో భాగంగా బ్లాక్‌ను ఒక యూనిట్‌గా తీసుకొని ప్రణాళికా రచనలు చేయాలని సిఫార్సు చేసింది. అశోక్ మెహతా సిఫార్సుల ఫలితంగా ఆ తర్వాత కాలంలో పంచాయతీరాజ్ వ్యవస్థలో పలు మార్పులు, చేర్పులు చోటు చేసుకున్నాయి.

60 ఏళ్ల తెలంగాణ గోసను తీర్చిన కేసీఆర్

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్



బీఆర్ఎస్ కార్యాలయంలో ఉద్యమం నాటి ఫొటోలను తిలకిస్తున్న వినయ్‌భాస్కర్ తదితరులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): 60 ఏళ్ల తెలంగాణ ప్రజల గోసను తీర్చిన ఉద్యమ నేత మాజీ సీఎం కేసీఆర్ అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ కొనియాడారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్ష దివస్‌లో భాగంగా ఉద్యమ నాటి ఫొటోల ఎగ్జిబిషన్, కేసీఆర్‌పై రాసిన పుస్తకాల ప్రదర్శనను దాస్యం వినయ్‌భాస్కర్, రిటైర్డ్ ప్రొఫెసర్ శోభ ప్రారంభించారు. అనంతరం తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ దీక్ష, అమరుల త్యాగం, సకల జనుల పోరాటంతోనే స్వరాష్ట్రం సిద్ధించిందని అన్నారు. మలిదశ ఉద్యమ తొలి అమరుడు శ్రీకాంతాచారి ప్రాణత్యాగం మరువలేనిదని అన్నారు. కేసీఆర్ పట్టుదల, లక్ష్యసాధన, పోరాటపటిమ విద్యార్థులకు చదువుల్లో కష్టపడడానికి స్ఫూర్తిని ఇస్తుందని దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్‌లో భాగంగా ఈనెల 5న బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను బీఆర్ఎస్వీ నేతలతో కలిసి వినయ్‌భాస్కర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంకు నర్సింగరావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మనోజ్‌కుమార్, బుద్దె వెంకన్న, భైరపాక ప్రశాంత్, పస్తం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సతి గెలుపు కోసం పతి పాదయాత్ర

నర్సంపేట టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గూడూరు లైన్ తండా గ్రామ పంచాయతీలో వినూత్న సంఘటన చోటు చేసుకుంది. సర్పంచ్ పదవికి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వాంకుడోతు పుష్ప గెలుపు కోసం ఆమె భర్త తావునాయక్ పాదయాత్ర చేపట్టడం విశేషం. తండాలో నివసించే దాదాపు 450 మంది ఓటర్లు ఉపాధి కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారందరి మద్దతు పొందాలంటే వారి వద్దకే వెళ్లాలనుకున్నాడు తావునాయక్.

అంగ వైకల్యం ఉన్నా..

అంగవైకల్యం ఉన్నా ఆత్మవిశ్వాసంతో తాను అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగుతున్నాడు తావునాయక్. తన భార్యను ఎలాగైనా గెలిపించాలనే ఉద్దేశంతో పుట్టుకతో ఎడమ కాలు, చెయ్యి రెండు అంగవైకల్యం కలిగినా ఆయన గూడూరు - నర్సంపేట మార్గం గుండా నేరుగా హైదరాబాద్ వరకు పాదయాత్ర ప్రారంభించారు. నేరుగా హైదరాబాద్‌లో ఉండే ఓటర్ల వద్దకు పాదయాత్ర ద్వారా వెళ్లి వేడుకునేందుకు వెళ్లడం విశేషం. కాగా, ఈ పాదయాత్ర బుధవారం నర్సంపేటకు చేరుకుంది. తావునాయక్ పాదయాత్రను చూసి గ్రామస్థులు, నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.



హైదరాబాద్‌కు నడిచి వెళ్తున్న తావునాయక్

సెల్ స్విచ్ ఆఫ్.. ఆపై జంప్..!

- ఉపసంహరణల కోసం పార్టీ ఒత్తిళ్లతో పలువురు అభ్యర్థుల తీరు
- మధ్యాహ్నం 3 తర్వాత స్విచ్‌ఆన్


కేసముద్రం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం కోసం ఒత్తిళ్లను తప్పించుకునేందుకు పలువురు అభ్యర్థులు తమ సెల్‌ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకొని, స్థానికంగా లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని పలు గ్రామాల్లో ఒకే పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు పోటీలో నిల్చున్నారు. అయితే అందులో ఒకరికే పార్టీ నుంచి మద్దతు లభించగా ఇతర రెబల్ అభ్యర్థులను ఉపసంహరింపజేసేందుకు, కొన్ని గ్రామాల్లో ఏకగ్రీవం చేసేందుకు పార్టీ నాయకులు నామినేషన్లు ముగిసిన రోజు నుంచి ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. పార్టీకి చెందిన స్థానిక, జిల్లా స్థాయి నాయకులు సైతం ఫోన్లు చేస్తుండడం, అభ్యర్థి ఎవరు చెబితే వింటాడో వారి ద్వారా కూడా చెప్పించారు. కొన్ని గ్రామాల్లో పార్టీ నాయకుల మాట విని పలువురు అభ్యర్థులు ఉపసంహరణలు చేసుకున్నారు. ఎలాగైనా పోటీ చేయాలని భీష్మించుకున్న కొందరు అభ్యర్థులు ఈ ఒత్తిళ్లను తట్టుకోలేక తమ సెల్‌ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేసుకొని స్థానికంగా లేకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. బుధవారం మధ్యాహ్నం ఉపసంహరణల సమయం 3 గంటల అనంతరం మొబైల్ స్విచ్ ఆన్ చేసుకొని మళ్లీ గ్రామంలో ప్రత్యక్షం కావడం గమనార్హం.

ఒకే వాడలో రెండు జీపీల ఓటర్లు



ఒకే వాడలో ఉన్న బయ్యారం, అంకుసాపూర్ ఓటర్ల ఇళ్లు

కాటారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఒకే వాడలో రెండు గ్రామ పంచాయతీల ఓటర్లు ఉన్న విచిత్ర పరిస్థితి భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో నెలకొంది. అంకుసాపూర్‌కు చెందిన 300 మందికి పైగా ప్రజలు బయ్యారం జీపీలో ఓటర్లుగా మారాల్సి వచ్చింది. 1995లో టీడీపీ హయాంలో కొత్త గ్రామ పంచాయతీగా బయ్యారం ఏర్పడింది. అంకుసాపూర్ పక్కనే బయ్యారం ఆవిర్భవించగా సరిపడా జనాభా లేకపోవడంతో కొంతమందిని ఈ జీపీలో కలిపారు. కొందరు నాయకులు అంకుసాపూర్‌లోని కొన్ని వాడలను బయ్యారం జనాభాగా చూపి అంకుసాపూర్‌లో భాగంగా ఉన్న బయ్యారాన్ని ప్రత్యేక జీపీగా చేయించుకున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం అంకుసాపూర్ 1,046, బయ్యారంలో 850 మంది ఓటర్లు ఉన్నారు. బయ్యారం పంచాయతీ ఏర్పాటుతో అప్పటి నుంచి వారంతా అంకుసాపూర్ గ్రామంలోనే ఉంటున్నా బయ్యారం ఓటర్లుగా కొనసాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న బయ్యారం వెళ్లి ఓటు వేసే దుస్థితి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆధార్ కార్డులో అంకుసాపూర్ అడ్రస్ ఉండగా, రేషన్ కార్డు మాత్రం బయ్యారం అడ్రస్ ఉందని అంటున్నారు. వాడలకు నీటి సరఫరా, వీధి దీపాలు పెట్టేటప్పుడు సైతం రెండు గ్రామ పంచాయతీల సిబ్బంది మీరంటే మీరని వాదులాడుకునే పరిస్థితి ఉందని సింగిల్ విండో డైరెక్టర్ అయిలి రాజబాపు తెలిపారు. నూతన గ్రామ జీపీల ఏర్పాటు సమయంలో అప్పటి అధికారులకు, కలెక్టర్‌కు సైతం వినతి పత్రాలు ఇచ్చామని, అయినా తమ గోడును పట్టించుకునే వారు లేరని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రేషన్ కార్డులో ఉన్న రెండు గ్రామాల పేర్లు

గులాబీలో గలాటా

(5వ పేజీ తరువాయి)

మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్.. తన జిల్లా పరిధిలో ఉన్న మండలాలను తానే సమన్వయం చేసుకుంటానని తేల్చి చెపుతున్నట్లుగా సమాచారం. వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని హసన్‌పర్తి, ఐనవోలు మండలాలు హనుమకొండ జిల్లాలో ఉన్నాయి. దీంతో ఎర్రబెల్లి మనస్తాపానికి గురైనట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే గత నెల 26వ తేదీన ఉమ్మడి జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు సందర్శనతో పాటు హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన దీక్ష దివస్ సన్నాహక సమావేశం జరిగింది. అయితే జనగామలో జరిగిన సమావేశంలో పాల్గొని, వరంగల్‌లో జరిగిన కార్యక్రమాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. కొద్దిరోజులుగా వినయ్‌భాస్కర్‌తో ఎర్రబెల్లికి విభేదాలు ఉండటమే కారణమనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ కీలక నేతలు మీడియా సమావేశాలు హనుమకొండ బీఆర్ఎస్ కార్యాలయంలో జరుగుతున్నప్పటికీ ఎర్రబెల్లి దూరంగా ఉంటున్నారు. దీంతో వర్ధన్నపేట కేంద్రంగా దాస్యం వర్సెస్ ఎర్రబెల్లి లొల్లి జరుగుతోంది.

ఇదిలా వుండగా, తన పర్యటనకు ఎర్రబెల్లి దూరంగా ఉండటం వెనుక మతలబేమిటని కేటీఆర్ ఆరా తీసినట్లుగా సమాచారం. విషయం తెలుసుకున్న కేటీఆర్.. మరుసటి రోజు హసన్‌పర్తి మండల సమావేశంలో స్వయంగా ఎర్రబెల్లికి ఫోన్‌చేసి హసన్‌పర్తితో పాటు ఆ మండల పరిధిలోని డివిజన్‌ల బాధ్యతలు దయాకర్‌రావే చూసుకుంటారని కేటీఆర్ కార్యకర్తలకు చెప్పారు. వినయ్‌భాస్కర్‌కు నేను చెబుతా.. అంటూ కేటీఆర్ హామీ ఇచ్చారు. దీంతో ఎర్రబెల్లి తీరుపై వినయ్‌భాస్కర్ వర్గం కోపంగా ఉంది. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వినయ్‌భాస్కర్‌కు ఆహ్వానం లేకుండా ఎలా సమావేశాలు పెడుతారని, బీసీ ఉద్యమం నడుస్తున్న వేళ.. బీసీ అయిన వినయ్‌భాస్కర్ లేకుండా పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక చేస్తారా? అని ప్రశ్నిస్తున్నారు.

అయితే వినయ్‌భాస్కర్ కూడా నియోజకవర్గాల పునర్విభజనలో హసన్‌పర్తి మండలంతో పాటు కొన్ని డివిజన్లు కూడా తన పరిధిలోకి వస్తాయని, దీంతో ఇప్పటి నుంచే ఆ ప్రాంత కేడర్‌లో టచ్‌లోకి వెళ్లాలని యోచిస్తున్నారనే చర్చ ఉంది. మరోవైపు అందరికీ ఒక్క నియోజకవర్గంలోనే బాధ్యతలు ఉంటే.. ఎర్రబెల్లికి రెండు నియోజకవర్గాల్లో బాధ్యతలు ఏమిటని మాజీ సీఎం కేసీఆర్ వద్ద ఎర్రబెల్లి వ్యతిరేక వర్గం వాదిస్తోంది. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి వర్ధన్నపేట బాధ్యతలు ఇవ్వాలని ఆ వర్గం పట్టుబడుతోంది. దీంతో ఇప్పట్లో ఈ వర్ధన్నపేట బాధ్యతల లొల్లి సద్దుమణిగేలా లేదనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి.

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 2022 జనవరి 26న అన్ని జిల్లాలకు పార్టీ అధ్యక్షులను అధిష్ఠానం నియమించింది. సుమారు నాలుగేళ్లు కావొస్తున్నా.. ఇప్పటివరకు జిల్లా కార్యవర్గాలను బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రకటించలేదు. రెండేళ్ల అధ్యక్ష పదవికి కూడా నాలుగేళ్లు కావస్తున్న కొత్త కమిటీలు లేవు. ఇక జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పాకాల సంపత్‌రెడ్డి 2023 డిసెంబరు 4వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. రెండేళ్లు కావొస్తున్నా.. ఇప్పటివరకు జనగామ జిల్లాకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడిని నియమించలేదు. జనగామ నియోజకవర్గం నుంచి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో అధ్యక్షుడు లేకపోవడంతో పార్టీ భారం కూడా పల్లాపై పడుతోంది.

అధ్యక్షులను కూడా నియమించలేరా ?

అలాగే వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ 2024 మార్చి 16న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అప్పటి నుంచి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీకి అధ్యక్షుడు లేకుండాపోయారు. వరంగల్ జిల్లా నుంచి అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, జడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ పెద్దిస్వప్నతో పాటు ఆరడజను మంది రెడీగా ఉన్నారు. అయినా నియామకంపై అధిష్ఠానం దృష్టి పెట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రెండు కీలకమైన జిల్లాలకు పార్టీ అధ్యక్షులను, కార్యవర్గాలను నియమించకపోటంతో కేడర్‌లో అసంతృప్తి రేగుతోంది. పంచాయతీ ఎన్నికల వేళ పార్టీని సమన్వయం చేసేది ఎవరు అనేది గులాబీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించాలి


కలెక్టర్ స్నేహ శబరీష్



దామెరలో నామినేషన్ల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

దామెర, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని కలెక్టర్ స్నేహ శబరీష్ తెలిపారు. బుధవారం దామెర మండలంలో ఏర్పాటు చేసిన మూడో విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. ఇందులో భాగంగా దామెరతో పాటు ఒగ్లాపూర్ క్లస్టర్ల వద్ద ఎలక్షన్ నోటీస్, రిజర్వేషన్ల జాబితాలను ఆమె పరిశీలించారు. అలాగే ఆర్వోలు, ఏఆర్వోలతో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియతో పాటు అధికారులు, సిబ్బంది, పోలీస్ భద్రత వంటి వివరాలను ఎంపీ డీవో కల్పన జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా పరకాల ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, ఎంపీడీవో గుమ్మడి కల్పన, తహసీల్దార్ ఎం.జ్యోతివరలక్ష్మీదేవి, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆఫీసర్(పీఆర్ ఏఈ) జె.సమ్మిరెడ్డి, ఎంపీవో కె.వి.రంగాచారి, ఆర్వో వై.సత్యనారాయణ, సీఐ పి.రంజిత్‌రావు, దామెర ఎస్సై కొంక అశోక్, జీపీ సెక్రటరీలు ఇంజపెల్లి నరేష్, కవిత, జీపీ సిబ్బంది, అంగన్ వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని ఒగ్లాపూర్ క్లస్టర్‌లో ఎన్నికల నామినేషన్ స్వీకరణ ప్రక్రియను జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ పరిశీలించారు. ఇందులో డివిజనల్ పంచాయతీ అధికారి రవిబాబు, ఎంపీవో కె.వి.రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

సోమశేఖర్‌కు డాక్టరేట్



వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన తాటికొండ సోమశేఖర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసింది. ఫీచర్ సెలక్షన్ యూసింగ్ మెటా హ్యూరిస్టిక్ టెక్నిక్ ఫర్ స్క్యూవేడ్ డాటా క్లాసిఫికేషన్ ప్రాబ్లమ్ అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ హెడ్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తిచేశారు. డాక్టరేట్ పొందిన తాటికొండ సోమశేఖర్‌ను పలువురు అభినందించారు.

మేడారంలో భక్తుల సందడి



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలి వస్తున్నారు. బుధవారం సుమారు 10వేల మందికి పైగా వనదేవ తలను దర్శించుకున్నారు. మహాజాతర జనవరి చివరి వారంలో మహాజాతర జరగనుండగా ముందస్తుగా వచ్చి మొక్కులు చెల్లించు కుంటున్నారు. కాగా, మాస్టర్ ప్లాన్‌లో భాగంగా మేడారం వనదేవతల దేవ స్థానం వద్ద అభివృద్ధి పనులు సాగుతున్నాయి. పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల స్థల మార్పు కోసం దేవస్థానంలో వరుస క్రమంలో నూతనంగా ఏర్పాటు చేశారు. సమ్మక్క-సారలమ్మల గద్దెలను దర్శించుకొని అదే క్రమంలో పగిడిద్ద రాజు, గోవిందరాజును భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లను చేశారు. ఈ నూతన గద్దెలపై దేవతలను గురువారం పునః ప్రతిష్ఠించనున్నారు.



పునఃనిర్మాణం అవుతున్న గోవిందరాజు గద్దె

బాలికపై లైంగిక దాడికి యత్నం

- యువకుడిపై పోలీసులకు ఫిర్యాదు - మిల్స్ కాలనీలో ఘటన

కరీమాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మిల్స్‌కాలనీ పరిధిలో ఓ యువకుడు 8 సంవత్సరాల బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉర్సు హరిజనవాడకు చెందిన వేల్పుగొండ (కరాటే) కుమారస్వామి కిరాణం వ్యాపారం చేస్తున్నాడు. ఇతనికి ముగ్గురు కుమారులు ఉండగా చిన్న కుమారుడైన కమల్ అలియాస్ అబ్బు అనే యువకుడు మంగళవారం నాడు షాపులో ఉన్నాడు. అదే సమయంలో సరుకుల కోసం వచ్చిన బాలికకు చాక్లెట్ ఆశ చూపించి లోనికి తీసుకెళ్లాడు. అసభ్యంగా ప్రవర్తిస్తుండగా షాపులోకి ఇతరులు రావడంతో వదిలేశాడు. దీంతో బాలిక ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లింది. తల్లిదండ్రులు కంగారు పడి ఏం జరిగిందని ఆరా తీశారు. షాపులో ఒంటరిగా ఉన్న కమల్ తనను బెడ్‌రూంలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడని, తన దుస్తులు విప్పుతుండగా షాపులోకి ఇతరులు రావడంతో వదిలేశాడని, దీంతో పరుగెత్తుకుంటూ ఇంటికి వచ్చానని తెలిపింది. ఈ ఘటనపై వారు వెంటనే మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ బొల్లం రమేష్ తెలిపారు.

దుర్గ్యానాయక్ తండా సర్పంచ్‌గా అనూష

● ఏకగ్రీవమైన సర్పంచ్, పాలక మండలి సభ్యులు

● మండలంలో 65 వార్డులు ఏకగ్రీవం



జఫర్‌గఢ్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మొదటి విడత జరిగే జఫర్‌గఢ్ మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు గాను దుర్గ్యానాయక్ తండా సర్పంచ్ సహా జీపీ పాలకమండలి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ గడువు అనంతరం ఇక్కడ నూతన సర్పంచ్‌గా గుగులోత్ అనూష యాకూబ్ ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఇక్కడ పోటీ లో ఉన్న ముగ్గురు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైంది. అలాగే జీపీ పరిధిలోని ఆరు వార్డుల్లో సైతం ఒక్కొక్కరే పోటీలో ఉండడంతో వారంతా ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు.

అలాగే జఫర్‌గఢ్ మేజర్ పంచాయతీ పరిధిలోని 13వ వార్డు సభ్యురాలుగా ఇల్లందుల రాధిక ఏకగ్రీవంగా ఎన్నికైంది. కాగా, నామినేషన్ల ఉపసంహరణ గడువు అనంతరం మండలంలోని మొత్తం 21 జీపీ సర్పంచ్ పదవుల్లో ఒకటి ఏకగ్రీవం కాగా, 194 వార్డుల్లో 65 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఇక మిగిలిన 20 జీపీ సర్పంచ్ పదవులకు, 129 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. సర్పంచ్ పదవులకు 71 మంది, వార్డు సభ్యుల పదవులకు 312 మంది పోటీలో నిలిచినట్లు అధికారులు తెలిపారు.

మండలంలో మూడు జీపీలు ఏకగ్రీవం

చిలుపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని తీగలతండా, గార్లగడ్డ తండా, దేశాయితండా జీపీలు ఏకగ్రీవమయ్యాయి. ఈ మేరకు జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అథారిటీ, ఎంపీడీవో బర్మావత్ శంకర్‌నాయక్ అధికారికంగా ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఇటీవల సర్పంచ్ పదవులకు పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా పలువురు తమ నామినేషన్లను స్వచ్ఛందంగా ఉపసంహరించుకోవడంతో సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసిన తీగల సాంబరాజు, మాలోత్ నవీన్, భూక్య వెంకటేశ్వర్లుతో పాటు, వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, వారందరికీ ఎన్నికల అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేయనున్నారు.

గ్రామ పాలన అధికారుల సంఘం ఎన్నిక



గ్రామ పాలన అధికారుల సంఘం జిల్లా నూతన కమిటీ సభ్యులు

జనగామ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలన అధికారుల సంఘం జిల్లా నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు కె.రామకృష్ణ సూచనల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్ ఆదేశాలతో జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. అనంతరం జిల్లా నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి మోటం కమలాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ గుగులోత్ మాన్‌సింగ్, సువార్త పర్యవేక్షణలో జిల్లా అధ్యక్షుడిగా జగ్గం కృష్ణ, కార్యదర్శిగా బురక వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా కె.విజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా సూర్యప్రకాశ్, జి.అనూష, కోశాధికారిగా రాము, ఇతర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ఎంఆర్‌సీలో బుధవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల విద్యా వనరుల కేంద్రం(భవిత) ఆధ్వర్యంలో పిల్లలకు ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా భవిత కేంద్రాల కోఆర్డినేటర్ నాగరాజు మాట్లాడుతూ.. దివ్యాంగులు నిరాశ, నిస్పృహలో కూరుకుపోకుండా ధైర్యం, ఆత్మవిశ్వాసంతో ఎదగాలని అన్నారు. దివ్యాంగుల్లో అసాధారణ ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహిస్తే వారు అద్భుతమైన ఫలితాలు సాధిస్తారని తెలిపారు. వారిని విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరంగా ప్రోత్సహించాలన్నారు. భవిత కేంద్రం విద్యా సేవలను ప్రతి దివ్యాంగుడికి అందేలా చూడాలన్నారు. జిల్లాలో 12 భవిత కేంద్రాల ద్వారా దివ్యాంగులకు అందిస్తున్న విద్య, సేవా కార్యక్రమాలను వివరించారు. ఎంఈవో జి.కొమురయ్య, ఘన్‌పూర్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.శ్రీకాంత్, పీఎస్ హెచ్‌ఎం ప్రణీత, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు కె.రాజు, డి.ప్రవీణ్, రామతులసి, ఎంఆర్‌సీ సిబ్బంది గిరి, సునీత, లవన్, వెంకటేశ్వర్లు, శ్రీలత, రమేశ్, సంధ్య పాల్గొన్నారు.

● చిలుపూర్(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నపెండ్యాల జడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్(సీఎంవో) నాగరాజు నేతృత్వంలో కార్యక్రమానికి ఎంఈవో దాసరి గోవర్దన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 86 మంది దివ్యాంగ చిన్నారులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ.. దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దన్నారు. వారి ప్రత్యేక అవసరాల కోసం ప్రభుత్వం ఆర్థిక, చేయూతను అందిస్తోం



స్టేషన్‌ఘన్‌పూర్ భవిత సెంటర్‌లో దివ్యాంగులకు బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈవో కొమురయ్య

దన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గుడిమళ్ల సంపత్, ఐఈఆర్‌పీ రోహిణి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

చిలుపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య స్పష్టం చేశారు. బుధవారం చిలుపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో, మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే నేటికీ నిలిచి ఉన్నాయన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అత్యధిక స్థానాలు గెలవాలని అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉద్దెమారి రాజ్‌కుమార్, నాయకులు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, ఆకుల కుమార్, కేశిరెడ్డి రాకేశ్‌రెడ్డి, బత్తుల రాజన్‌బాబు, మోటం రాములు, నారగోని రాజుగౌడ్, తమ్మలి రాజు, మంతెన రాజు, చుక్క ప్రతిభ-రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో 69 మంది

లింగాలఘణపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొదటి దశలో పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉపసంహరణ ఘట్టం ముగిసిన తర్వాత లింగాలఘణపురం మండలంలోని 21 గ్రామ పంచాయతీలకు 69 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవికి బరిలో నిలిచారు. వారిలో చీటూరులో గడ్డం ఎల్లయ్య, ఎర్ర యాదయ్య, బండ్లగూడెంలో పోరెడ్డి సంతోషి, చెట్టిపల్లి వెంకట్‌నర్సింహ్మారెడ్డి, వేమల్ల లింగారెడ్డి, కిష్టగూడెంలో ధరావత్ రాజు, భూక్యా నర్సింహ్మా, కొత్తపల్లిలో ఎనగందుల వెంకన్న, కందుల భాగ్యలక్ష్మి, కుందారంలో కూకట్లరాజు, బైరు యాకన్న, నెల్లుట్లలో నర్సింగ రామకృష్ణ, నల్ల లాజర్, పటేల్‌గూడెంలో పొన్నాల బుచ్చయ్య, కడుదూరి సోమిరెడ్డి, నవాబుపేటలో బూడిద రాజు, బూడిది సదానందం, వడ్డిచర్లలో దూసరి సోమనర్సయ్య, చెరుకు కార్తీక్, వనపర్తిలో వంచ శైలజ, మద్దూరి పద్మ, పప్పు వెంకట్‌రెడ్డి, నేలపోగులలో గుగ్గిల్ల రేణుక, గుగ్గిళ్ల నవనీత, లింగాలఘణపురంలో బుట్రెడ్డి శ్రీలతారెడ్డి, ఎడ్ల లావణ్య, గుమ్మడవెల్లిలో ఆముదాల సుమలత, నక్క మనీషా, సిరిపురంలో చీటకోరు సంపత్, బొమ్మల్ల నాగులు, కళ్లెంలో ఏలె నిర్మల, బండ శోభ, మాణిక్యాపురంలో చౌదరిపల్లి విజయ్‌భాస్కర్, చౌదరిపల్లి పూర్ణచందర్, ఏనెబావిలో ఇట్టబోయిన బాలమణి, పుట్ట సుజాత, మందోనిగూడెంలో మాదరబోయిన స్వరూప, సోమనబోయిన మాధవి, నాగారంలో దండు పుష్పలత, గొరిగె ఉప్పలమ్మ, జీడికల్‌లో కొండబోయిన రజిత, కొండబోయిన మమత, రామచంద్రగూడెంలో గోగుల సురేందర్‌రెడ్డి, నాయిని సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి వీరితో పాటుగా మరో 29 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 196 వార్డులకు గాను 436 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు సమాచారం.

ట్యాంక్‌బండ్‌పై శ్రీకాంతాచారి విగ్రహం ఏర్పాటు చేయాలి

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం డిమాండ్

జనగామ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్‌బండ్‌పై శ్రీకాంతాచారి విగ్రహం ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రామేశ్వరాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆత్మబలిదానం చేసిన తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి 16వ వర్ధంతిని పురస్కరించుకొని బుధవారం జనగామ చౌరస్తాలో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం మహిళా అధ్యక్షురాలు మద్దోజు గంగాభవాణి అధ్యక్షత వహించగా, రామేశ్వరాచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

శ్రీకాంతాచారి చనిపోయి 16 సంవత్సరాలు గడుస్తున్నా ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహం ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ఆదుకుంటామని చెప్పిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాట మరిచిందన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారికి తగిన న్యాయం చేయాలని, ఇండ్లు కట్టించి, పెన్షన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జనగామ జిల్లా జేఏసీ కన్వీనర్ మంగళంపల్లి రాజు, స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వలభోజు చక్రపాణి, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా మహిళా కార్యదర్శి శ్రీలక్ష్మి, సరాభోజు ఆంజనేయులు, ఏనుగుతల సోమేశ్వర్, చల్లోజు నవీన్, అయిలా సోమనర్సింహాచారి, ఎలగందుల కృష్ణ, అవినాష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాంతాచారికి నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

ముగిసిన నామినేషన్ల పరిశీలన

సర్పంచ్ స్థానానికి 117, వార్డు స్థానాలకు 553 నామినేషన్లు

బచ్చన్నపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 26 గ్రామ పంచాయతీలు, 238 వార్డు స్థానాలకు జరగాల్సిన ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ బుధవారం రాత్రి ముగిసింది. సర్పంచ్ స్థానాలకు 117 నామినేషన్లు, వార్డు స్థానాలకు 553 నామినేషన్లను అధికారులు ఓకే చేశారు. ఇందులో రాంచంద్రాపూర్ సర్పంచ్ స్థానానికి ఒకే నామినేషన్ దాఖలైంది. గ్రామంలో 8 వార్డులకు గాను ఒకటి చొప్పున నామినేషన్లు వచ్చాయి. వీటిని అధికారికంగా కలెక్టర్ అనుమతితో ఏకగ్రీవంగా ప్రకటించాల్సి ఉంది. అలాగే మండల పరిధిలో మొత్తం 22 వార్డు స్థానాలకు ఒక నామినేషన్ చొప్పున వార్డుల్లో దాఖలయ్యాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం వీటిని ఏకగ్రీవంగా ప్రకటించనున్నారు. కాగా, నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిస్తే బరిలో నిలిచే వారి సంఖ్యపై స్పష్టత రానుంది.

ఇక ప్రచార హోరు!

(5వ పేజీ తరువాయి)

గుర్తులను కేటాయించారు. దీంతో అభ్యర్థులు జనగామ, హనుమకొండలో కరపత్రాలు, పేపర్ బ్యాడ్జ్‌లు, స్టిక్కర్ల వంటి వాటిని ముద్రించే పనిలో ఉన్నారు. బుధవారం రాత్రికి రాత్రే ప్రింటింగ్ పని పూర్తి చేసుకొని గురువారం ఉదయం నుంచే ప్రచారంలో మునిగిపోవాలని అభ్యర్థులు ఆలోచన చేస్తున్నారు. ప్రచారంలో భాగంగా అవసరమయ్యే మైక్ సెట్, సమావేశాలకు సంబంధించి అనుమతులు తీసుకునే పనిలో పడ్డారు. ప్రచారంలో నమూనా బ్యాలెట్లు, స్టిక్కర్లు, కరపత్రాలు ప్రధానంగా ఉంటాయి. నమూనా బ్యాలెట్‌లోని గుర్తును చూపుతూ, నమూనా బ్యాలెట్‌ను పంపిణీ చేస్తూ ఓటర్లను 'గుర్తు'ంచుకోవాలని అభ్యర్థిస్తుంటారు.

ఏకగ్రీవాల పర్వం

(5వ పేజీ తరువాయి)

తిరస్కరణకు గురయ్యాయి. బుధవారం ఉపసంహరణ ప్రక్రియ గడువు పూర్తి కాగా మొదటి విడతలో బరిలో ఉండే అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించారు. ఉపసంహరణ తర్వాత పలు సర్పంచ్ స్థానాలు, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మొదటి విడతలో 9 గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి. రఘునాథపల్లి మండలంలోని వెల్ది, అయ్యవారిగూడెం, సోమయ్యకుంట తండా, రామన్నగూడెం, పడమటిగూడెం, జఫర్‌గఢ్ మండలంలోని దుర్గానాయక్ తండా, స్టేషన్ ఘన్‌పూర్ మండలంలోని జిట్టెగూడెం, చిల్పూర్ మండలంలోని తీగలతండా, దేశయితండా, గార్లగడ్డతండా గ్రామాలు ఏకగ్రీవమయ్యాయి.

దివ్యాంగుల వికాసానికి తోడ్పాటునందించాలి

(5వ పేజీ తరువాయి)

జడ్జి సుచరిత పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల పట్ల సమాజ బాధ్యతను గుర్తు చేస్తూ, దివ్యాంగులపై సమాజం అవగాహన కలిగి ఉండి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. వారి పట్ల చులకన భావాన్ని వీడనాడాలన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రభుత్వం విద్యాశాఖ ద్వారా కల్పించబడుతున్న సౌకర్యాలు, వసతులు, వాటిని పొందేందుకు తల్లిదండ్రులు చేయాల్సిన పనులను, ఐఈఆర్పీలు వివరించారు. ప్రిన్సిపల్ జడ్జి శశి, జిల్లా విద్యాశాఖ ఏడీ సత్యనారాయణ మూర్తి, ఆయా మండలాల ఎంఈవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

మండల పరిధిలో 11 వార్డులు ఏకగ్రీవం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత మండలంలోని పాంనూర్, అక్కపల్లిగూడెం, చంద్రుతండా గ్రామాల పరిధిలోని 12 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. పాంనూర్ గ్రామంలో ఏకగ్రీవమైన వార్డుల వివరాలు 2వ వార్డు (చెరుకు రజిత-మహేందర్ రెడ్డి), 3వ వార్డు(మెహర సుల్తానా), 4వ వార్డు(వంగ ప్రభాకర్‌గౌడ్), 8వ వార్డు(కలకోల నరేందర్), అక్కపల్లిగూడెం గ్రామంలో 6వ వార్డు(బొమ్మగల్ల ఏలియా), చంద్రుతండాలో 1వ వార్డు (మాలోతు జయంతి), 2వ వార్డు(బానోతు ప్రియాంక), 3వ వార్డు(ఇస్లావత్ వినోద్), 4వ వార్డు(బానోతు గణేష్), 6వ వార్డు(భూక్య శిరీష), 9వ వార్డు(భూక్య మంజుల), 10వ వార్డు(భూక్య స్వరూప)లు ఏకగ్రీవం అయ్యారు.

సర్పంచ్‌గా గెలిపిస్తే

దుర్గమ్మ గుడికి భూమి ఇస్తా..

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : తనను గ్రామ సర్పంచ్‌గా ప్రజలు గెలిపిస్తే రోడ్డు పక్కన గల సర్వే నెంబర్ 9/ఏ లోని తన పేర ఉన్న 2 గుంటల భూమిని దుర్గమ్మ గుడికి ఇస్తానని, స్వంత ఖర్చులతో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తానని మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన సర్పంచ్ అభ్యర్థి గుర్రపు సునీత కుమార్ గ్రామ పంచాయతీ పత్రం పేరుతో బాండ్ పేపరును రాయించి గ్రామంలోని వాట్సాప్ గ్రూపులో పెట్టారు.

బాండ్ పేపరును రాయించి అందులో గ్రామానికి చెందిన పెద్దమనుషుల సమక్షంలో బాండ్ పేపరుపై సంతకం చేయడంతో పాటు, సాక్షులుగా గ్రామానికి చెందిన నాయకుల సంతకాలను చేయించారు. సర్పంచ్‌గా గెలిచాక ఇచ్చిన హామీని విస్మరించిన ఎడల సర్పంచ్ పదవికి ప్రమాణపూర్వకంగా రాజీనామా చేస్తానని పేర్కొన్నారు.

మొదటి రోజు 14 నామినేషన్లు దాఖలు

పాలకుర్తి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడో విడత స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మొదటి రోజు బుధవారం సర్పంచులు, వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలో 12 క్లస్టర్లు ఏర్పాటు చేయగా సర్పంచు స్థానాలకు మొదటి రోజు 14 మంది సర్పంచు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో వర్కల వేదవతి తెలిపారు. గుడికుంట తండాలో రెండు, మైలారంలో ఒకటి, విస్నూరులో ఒకటి, ఈరవెన్నులో ఒకటి, గోపాలపురంలో ఒకటి, గూడూరులో రెండు, బమ్మెరలో ఒకటి, పాలకుర్తిలో ఒకటి, దర్దెపల్లిలో రెండు, మేకలతండాలో ఒకటి, పెద్దతండా(కే)లో ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. అదేవిధంగా వివిధ గ్రామాల్లో వార్డులకు 14 నామినేషన్లు దాఖలు చేశారని పేర్కొన్నారు.

హిందువుల దేవుళ్ల జోలికి వస్తే ఊరుకోం..

జనగామ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందువుల జోలికి వస్తే ఊరుకునే ప్రస్తకే లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తేకల ఉమారాణి హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవుళ్లను అవమానించడాన్ని ఖండిస్తూ బీజేపీ పట్టణ అధ్యక్షుడు అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమారాణి మాటాడుతూ హిందువులంటే కాంగ్రెస్ పార్టీ నాయకులకు ద్వేషమని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి రుజువు చేశారన్నారు. హిందూ దేవుళ్లను కించపరిచిన రేవంత్‌రెడ్డి హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివరాజ్ యాదవ్, దేవరాయల ఎల్లయ్య, శశిధర్, పెద్దోజు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

దివ్యాంగ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి

జనగామ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ దివ్యాంగ ఉద్యోగులను విధుల నుంచి మినహాయించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ సహాయ జిల్లా ఎన్నికల అధికారి అవేవి పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

ఎన్నికల శిక్షణకు హాజరు కాలేదంటూ దివ్యాంగుల దినోత్సవం రోజున సదరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు అందించడం విచారకరమన్నారు. దివ్యాంగులకు, గుండె, కిడ్నీ, క్యాన్సర్, న్యూరో సంబంధిత ఉపాధ్యాయులకు కేటాయించిన విధులను వెంటనే రద్దు చేయాలని, వారికిచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చే స్తూ సహాయ ఎన్నికల అధికారికి వినతిపత్రం అంద జేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంకుషావలి, వజ్రయ్య తదితరులు పాల్గొన్నారు.



సహాయ ఎన్నికల అధికారికి వినతిపత్రం అందిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

ప్రజాస్వామ్య విజయానికి ఎన్నికలే పునాది



మాక్ ఎలక్షన్స్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జనగామ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విజయానికి ఎన్నికలే పునాది అని జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.కనకయ్య అన్నారు. బుధవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ జడ్పీ హైస్కూల్‌లో మాక్ ఎలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలను, ఎన్నికల ప్రక్రియను, ఓటింగ్ విధానంపై అవగాహన పరచడానికి మాక్ ఎలక్షన్స్(నమూనా ఎన్నికలు) ఉపయోగపడతాయన్నారు. ఎన్నికలలో పాఠశాల నాయకుడిగా భూక్య వెంకటేష్, పదవ తరగతి నాయకుడిగా ముఖేష్, 9వ తరగతి నాయకుడిగా ఎస్.రాంచరణ్, 8వ తరగతి నాయకురాలిగా సిద్రాత బుస్రమ్, 7వ తరగతి నాయకుడిగా ఇ.సంజయ్, 6వ తరగతి నాయకురాలిగా సిఖత్ ఫాతిమా ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, ఉమాదేవి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నేతలు

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్య నాయకులు కాంగ్రెస్ జిల్లా నాయకులు గొడుగు రాజయ్య, కత్తుల కట్టయ్యల సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మండల స్థాయి నాయకులు వంగపండ్ల మహేందర్, జూలురు మహేష్‌తో పాటు గ్రామ ముఖ్య నాయకులు తోటకూరి రాజు, తోటకూరి భిక్షపతి, కొడారి అశోక్, వంగపండ్ల నరహరి కాంగ్రెస్ కండువా కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గొడుగు రాజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్‌కు గ్రామాల్లో ఆదరణ కరువైందన్నారు. బీఆర్‌ఎస్‌తో భవిష్యత్తు ఉండదని భావించిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మందపురం ఎల్లాగౌడ్, గొడిశాల యాదగిరి, మంద రాజు, జిట్టెబోయిన రవి, మ్యాకల రాజు, బోయిని ఆంజనేయులు, లింగనబోయిన శ్రీనివాస్, పొగాకు సోమయ్య, పల్లె రవి, పిట్టల మధు, యాకుబెల్లి, మ్యాదరబోయిన కుమారస్వామి, క్రిష్ణమూర్తి, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రారంభమైన

మూడో విడత నామినేషన్లు

మొదటి రోజు 78 నామినేషన్లు దాఖలు

జనగామ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. జిల్లాలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల పరిధిలోని 91 గ్రామ పంచాయతీలు, 800 వార్డు సభ్యులకు గాను నామినేషన్లను అధికారులు స్వీకరించారు. మొదటి రోజు సర్పంచులకు 41, వార్డు సభ్యులకు 37 నామినేషన్లు దాఖలు అయ్యాయి.

మండలం	సర్పంచు స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
దేవరుప్పుల	32	13	274	8
కొడకండ్ల	21	14	190	15
పాలకుర్తి	38	14	336	14
మొత్తం	91	41	800	37

టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా లక్ష్మణ్



లక్ష్మణ్ నర్సింహులు

లింగాలఘణపురం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ లింగాలఘణపురం మండల శాఖ అధ్యక్షుడిగా తాళ్లపల్లి లక్ష్మణ్ బుధవారం ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో జరిగిన టీఎస్ యూటీఎఫ్ సమావేశానికి ఆ సంఘం కుటుంబ సంక్షేమ నిధి స్టేట్ బోర్డు డైరెక్టర్ ఆకుల శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరు కాగా ఆయన పర్యవేక్షణలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ప్రధాన కార్యదర్శిగా ఇ.నర్సింహులు, ఉపాధ్యక్షులుగా ఇంద్రసేనారెడ్డి, సునీత, కోశాధికారిగా తేరాల నవీన్‌కుమార్, కార్యదర్శులుగా కె.శ్రీకాంత్, ఎలిజబెత్ రాణి, శోభారాణి, బి.శ్రీనివాస్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా పి.మ ర్రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడు తూ 2010కి ముందు టీచర్ ఉద్యోగాన్ని సాధించిన వారికి టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.